# సొంత ఇల్లు

'ఎస్.ఎం.ఎస్. చేయండి, హౌసింగ్ లోన్ పొందండి'

పత్రికలో వచ్చిన ఈ బ్యాంక్ ప్రకటన నా కన్నా మా ఆవిడలో ఉత్సుకతని కలిగించింది.

'ఇంత ఈజీగా హౌసింగ్ లోన్ దొరకడమంటే మాటలా! ఎలాగైనా ప్లాట్ కొనాలనుకుంటున్నాం కదా... ముందు ఆ ప్లాట్ సంగతి చూడండి' అంది. బ్యాంకులు ఎగబడి లోన్‌లు ఇవ్వడం నాక్కూడా ఆశ్చర్యంగానే ఉంది. 'విద్యానగర్‌కి

దగ్గర్లో కొన్ని ప్లాట్లు పెట్టారు. డెబ్బయ్ వేలకి ఒక ప్లాట్ అంటున్నారు. కాస్సేపాగి వెళ్తాను' అని పేపర్ చదవడంలో మునిగిపోయాను.

గంట తర్వాత తయారై బండి మీద వెళ్తుంటే మరో బ్యాంక్ బ్యానర్‌లు కనిపించాయి.

దీపావళి ధమాకా.. 7.5 శాతం వడ్డీకే 'హౌసింగ్ లోన్‌లు' బ్యానర్ల మీద అందమైన ఇల్లు బొమ్మలు. అవన్నీ కళ్లల్లో మెరుస్తుంటే విద్యానగర్ ప్లాట్ల దగ్గరికెళ్లాను. అక్కడున్న రియల్ ఎస్టేట్ వ్యక్తిని రేట్ల గురించి అడిగాను. వాడు హుషారుగా షాకింగ్ న్యూస్ చెప్పాడు.

'ఈ మధ్య పేపర్ చూళ్లేదా సార్. మన సిటీకి బైపాస్ రోడ్ శాంక్షన్ అయ్యింది. ఇదిగో మన పక్క నించే వెళ్తోంది. డెబ్బయ్ అయిదు వేలున్న ప్లాటు ఇప్పుడు రెండు లక్షలయ్యింది. అయినా ప్లాట్లన్నీ అయిపోయాయి. ఒకటి రెండు తప్ప... బ్యాడ్ లక్. మీరు నెల కిందటే రావాల్సింది' అన్నాడు నింపాదిగా.

ఒక్కసారిగా నీరసం వచ్చేసింది.

'ఇల్లు కన్నా ప్లాటు పదిలం' అన్నట్టు అసలు ప్లాటంటూ ఉంటే ఏనాటికైనా ఇల్లు కట్టుకోవచ్చు... ఛ... రెండేళ్ల క్రితమే మంచి ప్లాటు చేజారిపోయింది. ఇప్పుడెందుకులే అనుకుంటే ప్లాట్ల రేట్లు రాకెట్‌లా దూసుకుపోతున్నాయి.

నీరసంగా వెనక్కి మళ్లాను. ఇంటికెళ్లి మా ఆవిడతో విషయం చెప్పాను.

'నేనెప్పట్నించో మొత్తుకుంటున్నాను. మీరు చేసే ఏ పనైనా ఇలాగే ఉంటుంది' అంది నిష్ఠూరంగా.

'మరేం చేద్దాం' అన్నాను అసహనంగా.

'ముందు మన చిట్టీ డబ్బులెత్తి ప్లాటు కొందాం... ఎందుకంటే ఆ తర్వాత

బ్యాంకుల హౌసింగ్ లోన్ వడ్డీ రేట్లు ఎలాగుంటాయో ఏమో..' అంది.

మొత్తానికి వారం రోజుల్లో చిట్టీ డబ్బులెత్తి ప్లాటు తీసుకున్నాం.

ఇంక ఇల్లు సంగతి... ఓ రోజు సాయంత్రం ఇద్దరం కూచొని లెక్కలు వేశాం.

'పెద్దదానికి ఇంకా పదేళ్లే కాబట్టి ఇప్పుడే ఇల్లు కట్టాలి. అది పెద్దయ్యాక చదువులు, పెళ్లి, కట్న కానుకల ఖర్చుంటుంది. నగలు, ఆర్‌డిలు అమ్మితే రెండు లక్షలొస్తాయి. ఇంకా అయిదు లక్షలు హౌసింగ్ లోన్ తీసుకోవాలి. అంటే నెలకి అయిదు వేల పైనే కట్టాల్సి ఉంటుంది. ఇద్దరిలో ఒకరి జీతం మొత్తం లోన్‌కే పోతుంది'.

ఇలా సాగాయి లెక్కలు...

మూడు గంటలు తర్జనభర్జనలయ్యాక ఒక అవగాహనకొచ్చాం.

'నా జీతం మొత్తం లోన్ కడదాం. మీ జీతంలో ఇల్లు గడుస్తుంది' అంటూ మా ఆవిడ బలంగా ప్రతిపాదించింది. సరే అన్నాను.

మర్నాడు...

ఒక బ్యాంకుకెళ్లాను. 'రుణ మేళా' అప్పులు పంచుతున్నంత హడావుడేమీ కనిపించలేదు. మేనేజర్‌ని కల్సి 'సర్... సెవెన్ పాయింట్ ఫైవ్ ఇంట్రెస్ట్‌కే హౌసింగ్ లోన్ అంటున్నారు కదా... నేను లోన్ కోసం వచ్చానార్' అన్నాను వినయంగా.

'సెవెన్ పాయింట్ ఫైవ్ అనేది ఫ్లోటింగ్ రేట్‌లో... ఫిక్స్‌డ్‌రేట్‌లో కాదు' అన్నాడు.

'అంటే?'

'ఫ్లోటింగ్ రేట్ అంటే ఈ నెలలో సెవెన్ పాయింట్ ఫైవ్ ఉన్న వడ్డీ వచ్చే నెలలో ఎనిమిది శాతం కావచ్చు. తొమ్మిది శాతం కావచ్చు. నెల నెలా పెరగొచ్చు, తగ్గొచ్చు. చెప్పలేం' అని చెప్పాడు.

'మరి ఫిక్స్డ్ రేటంటే...'

'ఇప్పుడు పిక్స్డ్ రేటు తొమ్మిది శాతం ఉంది. మీరు ఫిక్స్డ్ రేటు పై లోన్ తీసుకుంటే తీరేంత వరకూ అంతే ఉంటుంది'

'మీరు సెవెన్ పాయింట్ ఫైవ్ అంటే ఆశపడి వచ్చాను. ఇది ఫ్లోటింగ్ రేటని మీరు బ్యానర్ల మీద గాని, యాడ్స్‌లో గాని చెప్పలేదు' అన్నాను కొంచెం చిరాగ్గా.

మేనేజర్ నవ్వి 'అలా చెప్తే మీరు బ్యాంకు వరకూ రారు కదా! బ్యాంకు వరకూ వచ్చిన వ్యక్తి ఏదో ఒకటి నిర్ణయించుకుంటాడు' అన్నాడు.

'ఫిక్స్డ్ రేటే బెటర్ సార్... నేను లోన్ తీసుకోవాలనుకుంటున్నాను. ఎప్పుడిస్తారు?' అన్నాను.

'భలేవారు సార్... మీరు కొన్ని ఫార్మాలిటీస్ ఇవ్వాలి." అంటూ ఒక లిస్ట్ రాసిచ్చాడు.

'మున్సిపల్ పర్మిషన్, ఎస్టిమేషన్ సర్టిఫికెట్, లీగల్ అడ్వయిజింగ్... ఇవన్నీ సబ్మిట్ చేయండి' అన్నాడు.

'అదేంట్సార్... ఎస్.ఎం.ఎస్. చేస్తేనే హౌసింగ్ లోన్ ఇస్తామన్నారు' అన్నాను ఆశ్చర్యంగా.

'ఇస్తాం సార్. ఇవన్నీ పట్టుకొని రండి' అని తన పనిలో మునిగిపోయాడు.

వాస్తు ప్లస్ ఇంజనీర్‌తో ప్లాన్ గీయించి మున్సిపల్ పర్మిషన్‌కి అప్లై చేశాక క్లర్క్‌కి వెయ్యి రూపాయలు సమర్పిస్తేనే గాని కమీషనర్ సంతకం పడలేదు. తర్వాత ఎస్టిమేషన్ సర్టిఫికెట్ ఇచ్చే ఇంజనీర్‌ని కలిస్తే 'నేను ప్లాట్ చూడాలి. అడ్రస్ చెప్పండి. రెండు మూడ్రోజుల్లో వచ్చి చూస్తాను' అని చెప్పాడు.

వారం గడిచినా రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా 'ఫలానా చోట స్లాబ్ వేస్తున్నానండి... అక్కడున్నాను. లేదంటే ఫలానా చోట భూమి కొలతలు తీస్తున్నాను' అంటూ సమాధానం. చివరికి మూడు వారాల తర్వాత వచ్చి ఫ్లాట్ చూసి వెళ్లాడు. వారం తర్వాత వచ్చి ఎస్టిమేషన్ తీసుకెళ్లండి అన్నాడు. వారం తర్వాత వెళ్తే కాగితాలు చేతుల్లో పెట్టి 'రెండు వేల అయిదు వందలు ఇవ్వండి' అన్నాడు.

'అదేంట్సార్... మిమ్మల్ని బ్యాంక్ కదా నియమించుకుంది. బ్యాంక్ తరపున కదా మీరు పని చేసింది. బ్యాంకే ఇస్తుంది కదా' అన్నాను అనునయంగా.

'బ్యాంక్ ఇస్తుందండీ... మరీ ఇంత తొందరగా ఎస్టిమేషన్ మీకివ్వాలంటే తప్పదు. లేదంటే నేన బిజీగా ఉన్నాను... రెండు, మూడు నెలలు ఆగండి' అన్న నిర్లక్ష్యపు సమాధానం విని కంగు తిన్నాను.

మౌనంగా అతను చెప్పిన డబ్బు చేతిలో పెట్టాను.

అక్కణ్ణించి బ్యాంక్ లీగల్ అడ్వయిజర్ దగ్గరికెళ్లి 'పని ఏమైంది సార్' అన్నాను.

'రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచి ఇ.సి. తీసుకురండి. అలాగే రెవెన్యూ ఆఫీస్‌కెళ్లి పహాని నకలు పట్టుకురండి' అని చెప్పాడాయన తాపీగా.

పహానీ నకలు కోసం రెవెన్యూ ఆఫీస్ చుట్టూ తిరిగి తిరిగి వెయ్యి రూపాయల దాకా ముట్టచెప్పాక గాని నకలు చేతికందలేదు. రిజిస్ట్రేషన్ ఆఫీస్

చుట్టూ ఇంకోరోజు...

అవి రెండూ తీసుకెళ్లాక 'లింక్ డాక్యుమెంట్ తప్పకుండా కావాలండీ' అన్నాడు.

'అదేంట్సార్... నాకు తెలీదు' అన్నాను.

ఆ మాత్రం తెలీదా అన్నట్టు చూశాడా అడ్వకేటు.

'ఈ ప్లాటు మీకు ఫలానా వాడు అమ్మి రిజిస్ట్రేషన్ చేశాడు. కాని ఈ ప్లాటు వాడిదేనని నమ్మకమేంటి? అందుకే వాడికి ఈ ప్లాట్ ఎవరు అమ్మారో ఆ డాక్యుమెంట్స్ కావాలి. మన డిగ్రీ కాలేజి గ్రౌండ్‌ని కూడా ప్లాట్లు పెట్టి అమ్మొచ్చు సార్... కాని అమ్మేవాడికి అది రిజిస్ట్రేషన్ అయిందో లేదో చూసుకోవాలి కదా అన్నదే పాయింటు' అన్నాడు.

'ఇప్పుడా లింక్ డాక్యుమెంట్ ఎక్కడ దొరకాలి సార్' అనడిగాను.

'ప్లాట్ అమ్మినవాడి దగ్గరికెళ్లండి. దొరుకుతుంది. లేకపోతే లోన్ రావడం కష్టం' అన్నాడు. ఇంక మీరు వెళ్లొచ్చు' అన్న ధోరణిలో.

వెంటనే ప్లాట్ అమ్మినవాడి దగ్గరికి పరిగెత్తాను.

వాడు బిగ్గరగా నవ్వి 'ఆ మాత్రం మేనేజ్ చెయ్యకపోతే ఆయనేం అడ్వకేట్ సార్? ఏదో మేనేజ్ చెయ్యాలి. నా దగ్గర కూడా రిజిస్ట్రేషన్ కాగితాలు లేవు... వెనుకటికి మా తాతకి ఎవడో పదివేల అప్పుకింద దీనిని రాసిచ్చిండట. ఇప్పుడు ఈ భూమికి డిమాండ్ వచ్చింది. ప్లాట్లు పెట్టి అమ్ముతున్నాం' అన్నాడు.

మరిప్పుడు ఆ డాక్యుమెంట్స్ లేకపోతే లోన్ ఇవ్వనంటున్నారు... కంపల్సరీగా నాకా డాక్యుమెంట్స్ కావాలి' అన్నాను సీరియస్‌గా.

'ఓ పని చెయ్యండి సార్... మీ లెక్కనే ఇంక ముగ్గురొచ్చిండ్రు. ఇరవై

రోజుల తర్వాత కలువుండ్రి. ఎట్లనన్న చేసి ఇప్పిస్త' అని భరోసా ఇచ్చాడు.

ఈ మధ్యలో మళ్లీ వాడికి ఫోన్‌లు...

నెల రోజులు దాటినా లింక్ డాక్యుమెంట్లు ఇదిగో... అదిగో అంటాడే తప్ప సరైన రెస్పాన్స్ లేదు. ఇంట్లో మాత్రం మా ఆవిడ 'మీరేపని చేసినా ఇంతే... ప్లాట్ కొనేటప్పుడే ఇవన్నీ చూసుకోవాల్సింది.' అంటూ దీర్ఘాలు తీస్తూనే ఉంది. చివరికి వాడి నుంచి ఒక రోజు ఫోనొచ్చింది.

నే వెళ్లేసరికి అక్కడ మరో ఆరుగురున్నారు. అంతా నాలాంటి వాళ్లే.

'సార్... ఈ లింక్ డాక్యుమెంట్లు సృష్టించేసరికి ముప్పయ్ వేలు ఖర్చయింది. ఒక్కొక్కరూ అయిదు వేలిచ్చి వీటి జిరాక్స్ కాపీలు తీసుకుపోండ్రి' అన్నాడు వాడు.

'మేమెందుకిస్తాం' అన్నాడొకాయన.

నీకు ఖర్చయితే మేమెందుకివ్వాలి?' అడిగాడు మరొకాయన.

'ప్లాటు రేటే ఎక్కువయ్యింది. ఇంకా అయిదు వేలంటే ఎక్కన్నించి తెస్తాం' అన్నాడు ఇంకొకరు.

'నాకెందుకు సార్ ఈ డాక్యుమెంట్లు? మీకే అవసరం. మీకోసం ఖర్చు పెట్టిన. అయిదు వేలిస్తేనే ఈ కాగితాలిస్తా' అని కఠినంగా చెప్పి లోపలికెళ్లాడు వాడు.

అప్పు పక్షులందరం మొహాలు చూసుకున్నాం. ఇంక తప్పదన్నట్టు నాలుగు వేలకి బేరమాడి... వాడి చేతుల్లో డబ్బు పెట్టి కాగితాలు తీసుకున్నాం.

నేనైతే వెంటనే అడ్వకేట్ దగ్గరికి పరిగెత్తాను. ఆయన వారం తర్వాత రమ్మన్నాడు.

ఏడో రోజు గడవక ముందే ఆయన ముందున్నాను.

'మీ కాగితాలు రెడీ అయ్యాయి. మూడు వేలు ఇవ్వండి' అన్నాడు.

'అదేంటప్సార్. లీగల్ అడ్వయిజర్‌గా బ్యాంక్ కదా మిమ్మల్ని నియమించుకున్నది. ఏమైనా ఇస్తే బ్యాంక్ ఇస్తుంది కదా' అన్నాను.

'అవునయ్యా... కాని ఇంత తొందరగా నీ కాగితాలు రెడీ చేసి ఇతనికి లోన్ ఇవ్వొచ్చు అని సంతకాలు చేయాల్సిన అవసరం నాకేంటి? ప్రతి క్లయింట్ దగ్గరా తీసుకుంటాం' అని కాగితాలు డెస్క్‌లో వేసుకున్నాడు సీరియస్‌గా.

నిస్సహాయంగా మూడు వేలిచ్చి కాగితాలు తీసుకున్నా.

ఇ.సి. నుంచి లీగల్ సర్టిఫికేట్ వరకూ అన్నీ పట్టుకొని బ్యాంక్ మేనేజర్ ముందు వాలాను. ఆయన అన్నీ తిరగేసి 'అడ్వకేట్ ఇచ్చిన ఈ లీగల్ ఒపీనియన్ తీసికెళ్లి ఫలానా అడ్వకేట్ దగ్గరికెళ్లండి. ఆయన కూడా మా లీగల్ అడ్వయిజరే. ఇవి చూసి సెర్చి రిపోర్ట్ రాసిస్తాడు. అది పట్టుకురండి' అన్నాడు.

మళ్లీ ఇంకో అడ్వకేట్ దగ్గరికి పరుగులు.. ఆయనిచ్చిన కాగితాలు ఈయన తిరగేసి అసిస్టెంట్ చేత అంతా కరెక్టే అన్నట్టు కాగితం మీద టైప్ చేయించి సంతకం చేస్తూ 'రెండూ వేలివ్వండి' అన్నాడు. నిస్సత్తువగా తీసిచ్చాను.

నవనాడులూ కుంగిపోయాయి... అప్పు 'ఊబి' అంటారు. ఆ ఊబిలో కూడా పీక్కు తినే జలగలుంటాయని మొదటిసారి తెల్సింది. అందమైన కలలు కనండి అంటూ ఊబిలోకి తోస్తున్నదెవరు?? పులి-బంగారు కడియం కథ గుర్తొచ్చొంది.

బాధగా బయటికొచ్చాను... మనసంతా చికాకు...

'అంత అప్పు ఇస్తున్నప్పుడు ఈ మాత్రం తిరగక పోతే ఎలా?' మధ్య

తరగతి మనసు సమర్థిస్తోంది.

'సెర్చి రిపోర్టు' తీసికెళ్లి మేనేజర్‌కిచ్చాను. ఆయన కొన్ని ఫారాలు నింపి మరో విషయం చెప్పాడు.

'ప్రతి లక్ష రూపాయల అప్పుకి అయిదు వందల రూపాయలు ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ చెల్లించాలి. మీరు రిజిస్ట్రేషన్ ఆఫీసుకెళ్లి రెండున్నర వేలు విలువ చేసే స్టాంపులు కొని ఈ ఫారం మీద అంటించుకు రండి' అన్నాడు.

మళ్లీ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి పరుగులు...

తిరిగి వచ్చాక మేనేజర్ సీట్లో లేడు. ఫీల్డ్ ఆఫీసర్ పక్కకి పిల్చి 'మీ లోన్ తొందరగా శాంక్షన్ అవుతుంది లెండి. మేనేజర్, నేనూ వచ్చి మీ ప్లాట్ చూడాలి. తొందరగా లోన్ శాంక్షన్ కావాలంటే మాత్రం...' అంటూ నసిగాడు.

వెయ్యి రూపాయలు నా జేబులోంచి బావురు మంటూ జారుకున్నాయి.

చేష్టలుడిగిపోయినట్లుయి ఇంటికి చేరుకున్నాను.

టీ ఇస్తూ మా ఆవిడ మళ్లీ దీర్ఘం తీసింది.

'ఎస్.ఎం.ఎస్. చేస్తేనో, రుణమేళాలో అప్లయ్ చేస్తేనో హౌసింగ్ లోన్ ఇస్తామన్నారు. మీకేమో మూణ్నెల్లు పట్టింది. మీరు ఏ పని చేసినా ఇంతే...' అంది.

ఆ నిష్టూరాలు వినపడకూడదని టీవి ఆన్ చేశాను.

'కలలు కనండి.. హౌసింగ్ లోన్ తీసుకొని మీ ఇంట్లో సుఖంగా నిద్రపోండి' మరో బ్యాంకు యాడ్ వస్తోంది.

టీవి ఆఫ్ చేశాను.

ఇంతలో మళ్లీ మా ఆవిడ.

'గృహారంభం రోజున మీ చెల్లెలు మంగళహారతి పట్టాలి. ఆడబిడ్డతోనే అది మొదలవ్వాలి. మీ చెల్లెలికి ఫోన్ చేసి ఇల్లు కట్టుకుంటున్నామని చెప్పండి' అని ఆర్డర్ వేసింది.

అవును కదా అని చెల్లెలికి ఫోన్ చేసి విషయం చెప్పాను.

రెండు నిమిషాల మౌనం తర్వాత అది మాట్లాడింది.

'ఒరే అన్నయ్యా! ఇల్లు కట్టుకుంటున్నావు కదా... తులం బంగారం, పట్టు చీర పెడితేనే వస్తాను. ఏదీ పెట్టకపోతే మీ బావ కూడా ఒప్పుకోరు మరి' అంది.

'అదేంటే? గృహ ప్రవేశం రోజు ఎలాగూ కట్నకానుకలుంటాయి కదా' అన్నాను.

'అవి వేరే... నువ్వు ఇంటికి ముగ్గు పోసే రోజు మంగళహారతి పట్టాలి. అలాగే ఫ్రేమ్స్ (దర్వాజ) నిలబెట్టే రోజు కొత్త గడపకి నేను పసుపు కుంకుమలు రాసి తీర్చిదిద్దాలి. మళ్లీ గృహ ప్రవేశం రోజు నేనే కూరాడు కుండని కూచోబెట్టాలి...' అంది లిస్టు చదువుతూ.

'సరే... అలాగేనే' అని ఫోన్ పెట్టేశాను. నా గొంతులోని దైన్యత అది గమనించి ఉండదు.

నాకిప్పుడు అందరూ ఒకేలా కనిపిస్తున్నారు.

మున్సిపల్ క్లర్కు, ఎస్టిమేషన్ ఇంజనీరు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, లీగల్ అడ్వయిజర్, ప్లాటు యజమాని, ఫీల్డ్ ఆపీసరు, ఇంటి ఆడబిడ్డ...

xxx xxx xxx

ఇల్లు మొదలయ్యింది.

'ఇల్లు కట్టడం మొదలెట్టుకున్నవాడు... అది పూర్తయ్యేసరికి రెండు

సార్లయినా ఏడుస్తాడు' అన్నది పాత సామెత. అనుబంధాలు, విలువలు పూర్తిగా చచ్చిపోని కాలంలో పుట్టిన మాట అది. కానీ ఇప్పుడు 'ఇల్లు కట్టుకునేవాడు ఇరవై సార్లయినా ఏడుస్తాడన్నది' నిజం.

క్వింటాళ్ల కొద్దీ బంగారం దొరికినా... నాలుగు ఫిట్ల టేకు కర్ర దొరకడం మాత్రం గగనం... దాని మీద ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిఘాలు... లంచాలు...

సలహాలు... సూచనలు దాడి చేస్తాయి...

బంధువర్గం నుంచి కన్పించని జెలసీలు పీడిస్తాయి...

ఇసుక నుంచి సిమెంట్ దాకా మారే రేట్లతో మౌనంగా దెబ్బ తీస్తాయి...

వాస్తుకారులొచ్చి దిక్కుల్లో మూలల్లో పాతేస్తారు... బోరింగ్ భయపెడుతూ గుండెల్లోంచి కన్నీళ్లని వెలికితీస్తుంది...

కూలీ నుంచి దేవుడి దాకా గిల్లికజ్జాలాడుకుంటారు...

'పెళ్లి రోజు ఆకాశంలో అరుంధతి నక్షత్రం కన్పడుతోందా అంటే... అప్పులు కనపడుతున్నాయి అనే' పాత జోకులాగా... ఇల్లుని చూసిన ఆనందం అప్పు గుర్తొచ్చి ఆవిరవుతుంది.

xxx xxx xxx

కొత్తింట్లో చేరిన మొదటి నెలలో నా ఫోన్‌కి ఒక ఎస్.ఎం.ఎస్. వచ్చింది.

'ఈ రోజు మూడవ తేదీ, మీరు మీ లోన్ వాయిదా చెల్లించలేదు...' అని

ఆ ఎస్.ఎం.ఎస్.ని మా ఆవిడకి చూపించాను. బ్యాంకు వాళ్ల అర్థం ఇదేనేమో అని !

నాలుగో నెలలో అనుకుంటా... ఏదో ఫంక్షన్‌కి వెళ్లొచ్చి మా ఆవిడ సీరియస్‌గా చెప్పింది.

'మెడలో పుస్తెల తాడు తప్ప ఒంటి మీద బంగారం లేకుండా పోయింది. ఏ ఫంక్షన్‌కెళ్లాలన్నా సిగ్గనిపిస్తోంది. నేను నెక్లెస్ చేయించుకోవాలి. ఏడెనిమిది నెలల లోన్ ఎలాగోలా మీరే కట్టిండి' అంది.

'ఇల్లు గడవడం ఇబ్బంది కదా' అన్నాను.

'ఓ పని చేయండి. పల్లెలోని మీ ఇంట్లో సగం అమ్మేసి రండి. మీ అమ్మానాన్నలకి ఎనిమిది గదులెందుకు... అందులో నాలుగు గదులమ్మేస్తే కనీసం అరవై వేలన్నా వస్తాయి. అవి తెచ్చి లోన్ కట్టండి. నేను మాత్రం నా జీతం లోంచి పైసా ఇవ్వను' అంది కటువుగా.

'నువ్వంటున్న మాటలు సంస్కారవంతంగా లేవు. వాళ్లని ఈ స్థితిలో ఇబ్బంది పెట్టడం ఏమిటి? ఇల్లమ్మడం అంటే బాగుంటుందా?' అన్నాను సీరియస్‌గా.

'ఎందుకు బాగుండదు... వాళ్లిద్దరికీ ఆ పల్లెటూర్లో రెండు గదులు చాలవా?' అంది మరింత సీరియస్‌గా.

ఈ విషయం చిలికి చిలికి గాలివానే అయ్యింది. తన మాటలు నన్ను గాయపరిస్తే... నా వాదన ఆమె మనస్సుని చీల్చింది.

ఎవరి పంతాలు వాళ్లవి...

ఎవరి పట్టింపులు వాళ్లవి...

పెళ్లయ్యాక జరిగిన పెద్ద గొడవ ఇదే.

నాలుగైదు గంటల తర్వాత ఇల్లంతా నిశ్శబ్దం... హాల్లో కూచొని బాగా ఆలోచించాను.

ఇంటి లోన్ నెలనెలాల కడుతున్నది తన జీతంతోనే... తననెలాగైనా ఒప్పించాలి... ఓదార్చాలి... ఏవైనా మాటలు చెప్పి తన ఆలోచనని తప్పించాలి.

మొహం నిండా నవ్వు పులుముకొని... 'సరే నువ్వన్నట్టే చేద్దాం. రేపే మా ఊరెళ్లి మా వాళ్లకు చెప్పి వస్తాను. ధర రాగానే అమ్మేద్దాం. సరేనా...' అన్నాను.

నా నిర్ణయానికి తను సంతోషపడింది.

కానీ నాకెక్కడో చివుక్కుమంది... మనసంతా అర్థం కాని ఆలోచనలు ఆ రాత్రంతా... ఒక సాంఘిక నాటకాన్ని మించిన నటన జీవితాల్లోకి చొచ్చుకు వస్తోందా... ఎందుకిలా...ఏమో??!!

xxx xxx xxx

మర్నాడు... వూరెళ్లాను. నా మనసులాగే మబ్బు పట్టి ఉంది.

అమ్మ ప్రేమతో ఆహ్వానించింది. నాన్న పడక్కుర్చీలోంచి లేచి వచ్చి కుశలమడిగాడు.

ఆ మట్టి ఇంట్లో ఒక్కసారిగా చల్లదనం ఆవహించింది. ఏసీ కంటే భిన్నమైన చల్లదనం...

ఇల్లంతా ఏదో ప్రశాంతత...

పొగచూరిన వాసాలు... ఎనగర్రకి కట్టిన చెల్లెలి పెళ్లి బాసింగం.. చూరుకు వేలాడుతున్న పిచ్చుక గూడు... నాన్న పడక కుర్చీ... చిలక్కొయ్యకి తగిలించిన గొడుగు... దండెం మీద ఆరేసిన అమ్మ చీరలు...

ఏ ఇంటీరియర్ డెకొరేటర్‌కి అందని స్పృహ...

టపటప చినుకులు మొదలయ్యాయి...

ఒక్కసారిగా మట్టి వాసన నిలువెల్లా వీచింది... గుండెల్నిండా పీల్చుకున్నాను.

ఏ బ్యాంకూ అందించని పరిమళం.... ఏ ఫైనాన్స్‌లూ ఇవ్వలేని ప్రశాంతత... మార్బుల్ స్టోన్స్... పివోపి గోడల్తో కట్టుకున్న ఇంట్లో దొరకని ఆత్మతృప్తి చూరు కింది నీళ్ల శబ్దం పియానో రాగమవుతోంది...

పందిరి కింద చేరిన తల్లి కోడి రెక్కల కింద పిల్లలు దాక్కుంటున్న దృశ్యం... రంగుల చిత్రమై నిలిచిపోతుంది.

ఈ స్వర్గాన్ని అమ్మేయడమా...

స్వర్గాన్ని అమ్మేసి నరకాన్ని కొనుక్కోవడమంటే ఇదేనా...?

దీన్ని అమ్మేదామని అమ్మావాళ్లకు చెప్పడమా? ఆ సాయంత్రమే బయల్దేరాను.

'మనకై మనం అమ్ముతామంటే ధర తక్కువంటున్నారు. ఆర్నెల్లలో బాగా రేటు వస్తుందట. అంతవరకూ ఓపిక పడదాం...' ఇలాంటిదేదో చెప్పాలి తనకి.

మళ్లీ నటించాలి... నటనలో జీవించాలి...

బస్సెక్కబోతూ... బస్సు నిండా రాసిన యాడ్ చూసి ఉలిక్కిపడ్డాను.

'మీ కలలను సాకారం చేసుకోండి... మా బ్యాంకులో హౌసింగ్ లోన్ తీసుకోండి'.

*